1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 2 సంచిక : 200 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 15 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 200 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 15 June 2025 PAGES : 8 PRICE : 3/-

## ఈ నెల 23 నుంచి ఇంటింటికీ 'తొలి అడుగు' విజయయాత్ర



- టీడీపీ శ్రేణులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- త్వరగా పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటుకు ఆదేశం
- జూలైలో పార్టీ నేతలు, కార్యకర్తలకు నాయకత్వ శిక్షణా శిబిరాలు
- వచ్చే వారమే 'అన్నదాత సుఖీభవ' పథకం ప్రారంభం
- 'తల్లికి వందనం' నిధులు విడుదల, తల్లిదండ్రుల హర్షం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ నెల 23వ తేదీ నుంచి నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇంటింటికీ విజయ యాత్ర నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ యాత్ర ద్వారా... ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన -మిగతా 2లో

## లోకేశ్ విసిరిన సవాల్ స్వీకరించే ధైర్యం వైకాపాలో ఒక్కరికైనా ఉందా..?: మంత్రి గొట్టిపాటి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

తల్లికి వందనం పథకం కింద ఒక్క రోజులో విద్యార్థులకు రూ.10 వేల కోట్ల లబ్ధి ఓ రికార్డు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు, నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. తల్లులకు చేకూర్చే లబ్ధి చూసి ఓర్వలేకే ఈ పథకంపై వైకాపా విష ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. లోకేశ్ విసిరిన సవాల్ స్వీకరించే ధైర్యం వైకాపాలో ఒక్కరికైనా ఉందా?అని ప్రశ్నించారు. నిన్నటిదాకా మహిళలను వైకాపా సైకోలు కించపరిచారని.. ఇప్పుడు తల్లులు ఆనందంగా ఉండటం చూసి తట్టుకోలేక పోతున్నారని గొట్టిపాటి విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, టీచర్ల నియామకంపైనే కూటమి దృష్టి సారించిందని అన్నారు. తల్లికి వందనంలో రూ.13వేలు ఇచ్చి రూ.2వేలు తన ఖాతాల్లో పడ్డాయన్న వైకాపా నేతలకు తీవ్ర పరిణామాలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించిన విషయం తెలిసిందే. రూ.2వేలు తన ఖాతాలో పడినట్టు రుజువు చేయాలని.. లేకుంటే క్షమాపణ చెప్పి.. ప్రకటన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి విదేశీ పర్యటనకు వెళుతున్న ప్రధాని మోదీ

- ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 15 నుంచి 19 వరకు విదేశీ పర్యటన
- తొలుత సైప్రస్, తర్వాత కెనడా, చివరగా క్రొయేషియాలను సందర్శన
- కెనడాలోని కాననాస్కిస్‌లో జీ-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని
- ఇంధన భద్రత, ఏఐ, క్వాంటం అంశాలపై కీలక చర్చల్లో భాగస్వామ్యం
- రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌కు, తొలిసారిగా క్రొయేషియాకు భారత ప్రధాని
- యూరోపియన్ యూనియన్‌తో బంధాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 14)**

దేశంలో ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం తెలిసిందే. ఈ కీలక పరిణామం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన తొలి విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు ఆయన సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో పర్యటించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన నూతనోత్సాహంతో ప్రధాని చేపడుతున్న ఈ యాత్ర, అంతర్జాతీయంగా భారత్ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది.



### సైప్రస్ పర్యటన

పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత జూన్ 15, 16 తేదీలలో సైప్రస్‌లో ఉంటారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఖరారైంది. విశేషమేమిటంటే, రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. నికోసియాలో అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతారు. అనంతరం లిమాసోల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. ఈ భేటీలు మధ్యధరా ప్రాంతం మరియు యూరోపియన్ యూనియన్‌తో భారతదేశపు వ్యూహాత్మక బంధాలను కొత్త శిఖరాలకు చేర్చుతాయని ఆశిస్తున్నారు.

### కెనడాలో జీ-7 సదస్సు

ఆ తర్వాత, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కాననాస్కిస్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ప్రధాని మోదీ జీ-7 సదస్సులో పాలుపంచుకోవడం ఇది వరుసగా ఆరోసారి కావడం గమనార్హం.

ఈ వేదికపై ఇంధన భద్రత, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)-ఇంధన రంగాల అనుసంధానం, క్వాంటం టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకుంటారు. పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు. -మిగతా 2లో

## వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తా

తల్లికి వందనంపై వైసీపీ ఆరోపణలు

రూ.13 వేలు ఇచ్చి మిగతా రూ.2 వేలు లోకేశ్ జేబులోకి వెళ్లాయని ఆరోపణ

తీవ్రంగా స్పందించిన మంత్రి సవిత

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఫైర్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

తల్లికి వందనం పథకంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే తాను ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా చేయగలరా? -మిగతా 2లో

## అందుకే జగన్ అంటే నమ్మకం... బాబు అంటే మోసం అని ప్రజలు అనుకుంటున్నారు: రోజా

తల్లికి వందనంపై చంద్రబాబు మాట తప్పారంటూ రోజా ఫైర్

కేంద్రీయ విద్యాలయాల్లో చదివేవారిని అనర్హులను చేశారని ఆరోపణ

మోసం చేసిన మిమ్మల్ని ఏమనాలి బాబు గారూ అంటూ ట్వీట్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

తల్లికి వందనం పథకం విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పుతోందని, తల్లులను మోసం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న తీరుకు పొంతన లేదని ఆమె విమర్శించారు.సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, వాటి గురించి ప్రశ్నిస్తే నాలుక మందమని అనుకోవాల్సి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రోజా ఘాటుగా స్పందించారు. "చంద్రబాబు గారిని సూటిగా ప్రశ్నిస్తున్నా. ప్రతి విద్యార్థి తల్లికి 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు అడ్డగోలు షరతులు విధిస్తూ -మిగతా 2లో

## 'తల్లికి వందనం'పై విమర్శలు చేసే నైతిక అర్హత వైకాపాకు లేదు: జీవీ

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

అర్హులైన పిల్లలందరికీ తల్లికి వందనం ఇవ్వడం చరిత్ర అని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేకనే వైకాపా విమర్శలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఒకేరోజు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి రూ.10,091 కోట్లు ఇవ్వడం రికార్డన్నారు. ఈ పథకంపై విమర్శలు చేసే నైతిక అరత జగన్ పార్టీకి లేదన్నారు. లబ్ధిదారుల అరత నిబంధనలు గతంలో ఉన్నవేనని.. అవి వైకాపా చేసినవేనని ఆయన వివరించారు. ఈ పథకంపై సోషల్‌మీడియా వేదికగా ఆ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.



## నేరాలు చేసి ఇతరుల మీదకు నెట్టడం జగన్‌కు అలవాటు


**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

రాజకీయ ముసుగులో రౌడీయిజం చేయటం జగన్‌కు ఓ ఆటలా మారిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు. సమాజానికి ఎంతో చేటు చేస్తోన్న జగన్ రాజకీయాలకు పనికిరాడని ఆక్షేపించారు. పొదిలిలో పోలీసులు అరెస్టు చేసిన వారిపై ఇప్పటికే అనేక క్రిమినల్ కేసులున్నాయన్నారు. పొదిలిలో ఓటర్ లిస్ట్ కంటే జగన్ వెంట వచ్చిన వారిపై గత కేసుల లిస్టు ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. నానా యాగీ చేసేందుకే జగన్ ఈనెల 11న పొదిలిలో పర్యటించారని ఆరోపించారు. సంఘ విద్రోహశక్తులు, జిల్లా వైకాపా నేతలందరినీ సమీకరించి రైతుల పరామర్శ అనటం దేనికి సంకేతమని నక్కా ఆనందబాబు నిలదీశారు.

'ఎవడైనా రానీ తొక్కిపడేస్తాం' అనే బ్యానర్లతో ర్యాలీ చేయటం రైతు పరమర్శా అని ప్రశ్నించారు. చేసిన కుట్రలపై మళ్లీ ట్విటర్‌లో సమర్థించుకుంటూ పోస్ట్ పెట్టడానికి సిగ్గనిపించట్లేదా అని నిలదీశారు. జగన్ చేసే రౌడీ రాజకీయాల్ని ప్రభుత్వం ఎందుకు సహించాలని -మిగతా 2లో



## ఆసియాలోనే పొడవైన డబుల్ డెక్కర్‌గా విశాఖ మెట్రో!



డబుల్ డెక్కర్ విధానంలో విశాఖ మెట్రో

పైన మెట్రో, కింద వాహనాలకు ప్రత్యేక మార్గాలు

నాలుగు వరుసల పైవంతెనలతో కలిపి నిర్మాణం

సమగ్ర డీపీఆర్ కోసం కన్సల్టెంట్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆర్థిక సాయం అందించేందుకు ఏఐఐబీ సుముఖత

తొలిదశలో 20 కి.మీ. మేర డబుల్ డెక్కర్ నిర్మాణం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)**

విశాఖపట్నంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు, ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు, భవిష్యత్ విశాఖ ముఖచిత్రాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టును పట్టాలెక్కిస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఒక కీలకమైన, వినూత్నమైన నిర్ణయం తీసుకున్నారు. అదే 'డబుల్ డెక్కర్' విధానం. దీని ప్రకారం -మిగతా 2లో

## ఈ నెల 23 నుంచి ఇంటింటికీ

# ‘తొలి అడుగు’ విజయయాత్ర

టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ విజయయాత్రలో నాయకుల నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొని, ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రచారం చేయడంలో పోటీపడాలని ముఖ్యమంత్రి కోరారు. “మొదటి ఏడాది మనం ఏం చేశామో చెప్పడంతో పాటు, ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలి. మనం సాధిస్తున్న విజయాలు చూసి తట్టుకోలేకనే వారు మహిళలను అవమానించడం, దాడులకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు” అని చంద్రబాబు అన్నారు.

మహానాడు విజయవంతమైందని విశ్రాంతి తీసుకోవద్దని, పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి కమిటీలలో సముచిత స్థానం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. ‘కుటుంబ సాధికార సారథి’లో చురుగ్గా ఉన్నవారికే పార్టీలో పదవులు లభిస్తాయని, కార్యకర్తలు నిత్యం చైతన్యవంతంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

**‘సంక్షేమ పథకాల జోరు, ఆర్థిక క్రమశిక్షణ’**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ‘తల్లికి వందనం’ పథకాన్ని అమలు చేశామని, ఎంతమంది పిల్లలున్నా ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరేలా నిధులు విడుదల చేశామని సీఎం తెలిపారు. “మొత్తం 67.27 లక్షల మంది విద్యార్థులకు గాను, తల్లుల ఖాతాల్లోకి రూ.13,000 చొప్పున, పాఠశాలల అభివృద్ధికి రూ.2,000 చొప్పున జమ చేస్తున్నాం. ఈ పథకం కింద రూ.8,747 కోట్లు కేటాయించాం.

గత ప్రభుత్వం 42 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేసి రూ.5,540 కోట్లు ఖర్చు చేస్తే, మనం అదనంగా 25 లక్షల మందికి లబ్ధి చేకూరుస్తూ, ఏటా రూ.3,205 కోట్లు ఎక్కువగా ఖర్చు చేస్తున్నాం” అని చంద్రబాబు వివరించారు. నలుగురు పిల్లలు ఉన్న తల్లికి రూ.52,000 అందుతాయని, ఇంత పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నా కొందరు బుద్ధి, జ్ఞానం లేకుండా విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ‘అన్నదాత సుఖీభవ’ పథకాన్ని ఈ నెల 20వ తేదీన ప్రారంభిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ఏటా రూ.34 వేల కోట్లు అందిస్తున్నామని, అన్నా క్యాంటీన్ల ద్వారా ఇప్పటికే 4 కోట్ల భోజనాలు సరఫరా చేశామని గుర్తుచేశారు.

**యోగా దినోత్సవానికి భారీ ఏర్పాట్లు, పార్టీ కార్యకర్తలకు శిక్షణ**

రాష్ట్రంలో ‘యోగాంధ్ర’ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని 5 లక్షల మందితో నిర్వహించనున్నామని సీఎం తెలిపారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాలో పాల్గొనేలా లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటికే 2.21 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. “యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణమే మన లక్ష్యం. రేపు (శనివారం) లక్ష చోట్ల యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమాలు జరుగుతాయి” అని వెల్లడించారు.

జూలై నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులకు నాయకత్వ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని, కార్యకర్తలను సమర్థవంతమైన నాయకులుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, ఎమ్మెల్యేలు కూడా ప్రతిరోజూ పార్టీ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించి, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు.

## ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి విదేశీ పర్యటనకు వెళుతున్న ప్రధాని మోదీ

**చారిత్రక క్రొయేషియా పర్యటన**

ఈ విదేశీ పర్యటన చివరి అంకంలో, జూన్ 18న ప్రధాని మోదీ క్రొయేషియాను సందర్శిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెన్కోవిక్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరగనుంది. ఒక భారత ప్రధాని క్రొయేషియాలో పర్యటించడం ఇదే ప్రప్రథమం కావడంతో దీనికి చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. భారత్-క్రొయేషియా సంబంధాలలో

మొదటి పేజీ తరువాయి

ఇదొక సువర్ణాధ్యాయమని విదేశీ వ్యవహారాల శాఖ అభివర్ణించింది. ఈ పర్యటన ద్వారా యూరోపియన్ యూనియన్‌లోని ముఖ్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత పటిష్టం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తా

అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత సవాల్ విసిరారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ‘తల్లికి వందనం’ పథకం కింద కేటాయించిన నిధులలో రూ.2 వేలు నారా లోకేశ్ జేబుల్లోకి వెళ్లాయని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి సవిత ఘాటుగా స్పందించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని, కానీ ప్రజలు ఇప్పటికే వారిని పక్కనపెట్టారని, ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు.

**‘తల్లికి వందనం’తో తల్లుల ఖాతాల్లోకి నేరుగా నిధులు**

ఎన్డీయే ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ‘తల్లికి వందనం’ పథకాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని సవిత తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల 27 వేల 164 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా రూ.8,745 కోట్లు జమ చేశామని, దీంతో తల్లిదండ్రులు, పిల్లలు సంతోషంగా ఉన్నారని వివరించారు.

ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తుండగా, అందులో రూ.2 వేలు పాఠశాల అభివృద్ధికి, మిగిలిన రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. “ఇంట్లో ఒకరుంటే రూ.13 వేలు, ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, ఐదుగురుంటే రూ.65 వేలు అందజేశాం. ఒక కుటుంబంలోని ముగ్గురు ఆడబిడ్డలకు ఈ పథకం అందడంతో వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు” అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ కూడా ఈ పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల కృషి ఎనలేనిదని ప్రశంసించారు.

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ అమ్మఒడి ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట మార్చి ఒకరికే పరిమితం చేసిందని మంత్రి సవిత ఆరోపించారు. “జగన్ గారు ఎన్నికల ముందు ‘నా చెల్లెమ్మలు, నా ఆడపడుచులు, వారి బిడ్డలకు నేను మేనమామ’ అని చెప్పుకున్నారు. అధికారంలోకి వచ్చాక కంసమామగా మారారు. 2022-23లో కేవలం 42 లక్షల 61 వేల మందికే రూ.5,500 కోట్లు ఇచ్చారు. మేము అదనంగా దాదాపు 25 లక్షల మందికి లబ్ధి చేకూర్చాం” అని సవిత వివరించారు.

## అందుకే జగన్ అంటే నమ్మకం... బాబు అంటే మోసం అని ప్రజలు అనుకుంటున్నారు: రోజా

కొందరికే ఈ పథకాన్ని పరిమితం చేశారు. తల్లులను మోసం చేసిన మిమ్మల్ని ఏమనాలి బాబు గారూ?” అంటూ రోజా నిలదీశారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో పథకాన్ని నీరుగార్చడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆమె ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూనే, మరోవైపు షరతులతో వాటికి కోతలు విధిస్తున్నారనేది వాస్తవం కాదా? అని ఆమె ప్రశ్నించారు. ముఖ్యంగా ‘తల్లికి వందనం’ పథకం విషయంలో కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులను పూర్తిగా అనర్హులుగా చేయడం దారుణమని రోజా అన్నారు. “గతంలో జగనన్న హయాంలో కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లికి ‘అమ్మ ఒడి’ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాం. ఆ వివరాలు ప్రభుత్వం దగ్గర అధికారికంగా ఉన్నాయి. కానీ, ఇప్పుడు పథకాన్ని ఎగ్గొట్టే కుట్రతో యూడైస్ ప్లస్ నుంచి కేవీ సంస్థలను కట్ చేసినట్టు తెలుస్తోంది. దీనివల్ల తాము తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నామని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు” అని రోజా తెలిపారు.

పేరుకు అందరికీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతూ, మరోవైపు ఇలా లబ్ధిదారులను తగ్గించడం ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిదర్శనమని ఆమె విమర్శించారు. ఇలాంటి చర్యల వల్ల కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో ఇంకెన్ని కోతలు విధిస్తుందోననే ఆందోళన ప్రజల్లో ఉందని రోజా వ్యాఖ్యానించారు. “అందుకే జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం అని ప్రజలు అనుకుంటున్నారు” అని పేర్కొన్నారు. ఈ మేరకు రోజా ట్వీట్ చేశారు.

## ఆసియాలోనే పొడవైన డబుల్ డెక్కర్‌గా విశాఖ మెట్రో!

మెట్రో రైలు పైభాగంలో ప్రయాణిస్తుండగా, దాని కింద వాహనాలు సాఫీగా వెళ్లేందుకు వీలుగా పైవంతెన నిర్మిస్తారు.

ఈ నూతన విధానంలో భాగంగా నగర నడిబొడ్డున నాలుగు వరుసల పైవంతెనలు రానున్నాయి. ఈ మార్పుల నేపథ్యంలో నాలుగు వరుసల పైవంతెనలు, మెట్రో లైనుకు కలిపి ఒకే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేయడానికి అనువైన కన్సల్టెంట్ నియామకం కోసం ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) తాజాగా ఆసక్తిగల సంస్థల నుంచి దరఖాస్తులు కోరింది. ఆసియా మౌలిక వసతులు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) ప్రతినిధులు ఈ ప్రాజెక్టుకు రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపడం, వారు ఏపీఎంఆర్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డితో కలిసి విశాఖలో పర్యటించడం ఈ ప్రాజెక్టుకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది.

**ఖర్చు.. సమయం.. స్థలం ఆదా**

వాస్తవానికి నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గతంలో 12 పైవంతెనలు నిర్మించాలని ప్రణాళిక వేసింది. మధురవాడ నుంచి లంకెలపాలెం మధ్య వీటి నిర్మాణానికి డీపీఆర్ కూడా సిద్ధం చేసింది. అయితే, ఇదే సమయంలో మెట్రో పనులు కూడా చేపడితే రెండు వేర్వేరు నిర్మాణాలతో ఇబ్బందులు తలెత్తడంతో పాటు, ఖర్చు కూడా అధికమవుతుందని భావించారు. రెండు ప్రాజెక్టులను సంయుక్తంగా చేపట్టడం ద్వారా స్థలంతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అధికారులు నిర్ణయానికి వచ్చారు.

ఇప్పటికే దేశంలోని నాగ్‌పూర్‌లో ఇలాంటి డబుల్ డెక్కర్ తరహా మెట్రో విజయవంతంగా నడుస్తోంది. ఆ ప్రాజెక్టుకు డీపీఆర్ తయారుచేసిన సంస్థ నుంచి అవసరమైన వివరాలను సేకరించి, జాతీయ రహదారుల సంస్థ అధికారులకు ఏపీఎంఆర్‌సీ సమర్పించింది. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్, ఎన్‌హెచ్ఏఐ సంయుక్తంగా భరించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. మొత్తం ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎంఆర్‌సీ చేపట్టనుంది.

**అత్యంత పొడవైన మెట్రో డబుల్ డెక్కర్**

విశాఖ మెట్రో ప్రాజెక్టును మొత్తం 140.13 కిలోమీటర్ల మేర నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందులో మొదటి దశలో 46.23 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో పనులు చేపట్టనున్నారు. ఈ మొదటి దశలో సుమారు 20.16 కిలోమీటర్ల మార్గాన్ని డబుల్ డెక్కర్ విధానంలో.. అంటే కింద రోడ్డు, దానిపై ఫ్లైఓవర్, ఆపైన మెట్రో ట్రాక్ వచ్చేలా నిర్మిస్తారు. ముఖ్యంగా మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు, అలాగే గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ మధ్య ఈ రెండు భారీ డబుల్ డెక్కర్ వంతెనలు రూపుదిద్దుకోనున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే, ఇది ఆసియా ఖండంలోనే అత్యంత పొడవైన మెట్రో డబుల్ డెక్కర్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

మొదటి దశ కింద కొమ్మాది-స్టీల్‌ప్లాంట్, గురుద్వారా-పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు అనే మూడు కారిడార్లకు ప్రణాళిక సిద్ధం చేశారు. కొమ్మాది-స్టీల్‌ప్లాంట్ మధ్య నిర్మించే 34.40 కిలోమీటర్ల కారిడార్‌లోనే ఈ డబుల్ డెక్కర్ ట్రాక్ రానుంది. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కిలోమీటర్ల మార్గంలో నిర్మించే డబుల్ డెక్కర్ వంతెన, ఎన్‌హెచ్ఏఐ ప్రణాళికలోని 8 పైవంతెనలను అనుసంధానిస్తూ ఒకే వంతెనగా రూపుదిద్దుకోనుంది. మరో డబుల్ డెక్కర్ వంతెన గాజువాక నుంచి స్టీల్‌ప్లాంటు మధ్య నిర్మించనున్నారు.

## నేరాలు చేసి ఇతరుల మీదకు నెట్టడం జగన్‌కు అలవాటు

మండిపడ్డారు. రౌడీ రాజకీయాలను చంద్రబాబు తొక్కిపడేయటం ఖాయమని తేల్చిచెప్పారు. రాజారెడ్డి రాజ్యాంగానికి, ఆ తరహా జగన్ రాజకీయాలకు రాష్ట్రంలో కాలం చెల్లిందన్నారు. శాంతిభద్రతల విఘాతానికి జగన్ చేసే కుట్రలు మానకుంటే అతని చుట్టూ ఉన్నవారు కూడా బలవటం ఖాయమని హెచ్చరించారు. నేరాలు చేసి వాటిని ఎదుటివారి మీదకు నెట్టడం జగన్‌కు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. పోలీసులు అరెస్టు చేసిన వారిపై గతంలో ఉన్న క్రిమినల్ కేసుల్ని నక్కా ఆనంద్ బాబు చదివి వినిపించారు.

## సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది నారా లోకేశ్ ఎద్దేవా

**వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు**

**‘తల్లికి వందనం’ నిధులపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని లోకేశ్ సవాల్**

**గడువు ముగిసినా జగన్ రుజువులు చూపలేదని, క్షమాపణ చెప్పలేదని వెల్లడి**

**చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

**శరణమా, న్యాయ సమరమా తేల్చుకోవాలని జగన్‌కు సూచన**



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)

ఏపీ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. జగన్ చేసిన ఆరోపణలపై సవాల్ విసిరితే స్పందన కరవైందని, ఇది ఆయన వైఖరికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు. “సవాల్ చేస్తే సౌండ్ ఆఫ్!” అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “బురద చల్లడం పారిపోయి ప్యాలెస్‌లో దాక్కోవడం జగన్ గారికి అలవాటు. తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వెళ్ళాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని ఛాలెంజ్ చేసాను. సమయం ముగిసింది, రుజువు చెయ్యలేదు, క్షమాపణ కోరలేదు. అందుకే మిమ్మల్ని ఫేకు జగన్ అనేది. లీగల్ యాక్షన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమరమా? తేల్చుకోండి” అంటూ జగన్ కు లోకేశ్ అల్టిమేటమ్ జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు, మిగతా రూ.2 వేలు పాఠశాలలు/కాలేజీల అభివృద్ధి నిధుల నిమిత్తం ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే, ఈ రూ.2 వేలు మంత్రి నారా లోకేశ్ జేబులోకి పోతున్నాయంటూ వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేశ్ సవాల్ విసిరారు.

## కులాలు, పార్టీలను పక్కనపెట్టి బీసీలుగా ఒక్కటవుదాం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 14)

‘కులాలు, పార్టీలను పక్కనపెట్టి బీసీలుగా ఒక్కటై పోరాడుదాం. రాజ్యాధికారం వైపు అడుగులు వేద్దాం’ అని పలువురు నేతలు పిలుపునిచ్చారు. న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్‌తో కలిసి మధ్యప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి పరికిపండ్ల నరహరి రచించిన ‘ఓబీసీల పోరుబాట’ పుస్తకాన్ని శనివారం తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో ఆవిష్కరించారు. జన అధికార సమితి, బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. “బీసీల శక్తి ఎంతో ప్రదర్శించుకోవాల్సిన అవసరం ఉంది. కులాల పేరిట ముందుకు సాగితే కులాలుగానే మిగిలిపోతాం. ఒక్కటిగా ఉంటే 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవచ్చు. రాష్ట్రంలో ముఖ్యమైన పదవీ బీసీలకు రావాలి. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టి కేంద్రానికి పంపించాం. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌లు లీడ్ తీసుకొని, ప్రధాని మోదీతో అపాయింట్‌మెంట్ తీసుకోండి. నేను కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీసుకొస్తా. మన రిజర్వేషన్ బిల్లు 9వ షెడ్యూల్‌లో వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొద్దాం” అని సూచించారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారు. ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్, రాష్ట్ర నీటివనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాశ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి పూర్ణచందర్‌రావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్, చీరల నారాయణ పద్మశాలిలు పాల్గొన్నారు.





## వేటపాలెం తాసీల్దార్ విధుల నుండి తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ జె వెంకట మురళి

4

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మహిళలపై దాడికి వైసీపీ నాయకులే కారణం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మండిపాటు

వైసీపీ పాలనలోనే అరాచకాలు

శాంతి కోసం కేసులు భరించాను



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)

మహిళలపై దాడికి వైసీపీ నాయకులే కారణమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆరోపించారు. శనివారం మార్కాపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పొదిలిలో మహిళలపై జరిగిన దాడి దృశ్యాలను మీడియా ముందు ప్రదర్శించారు.

**రాళ్ల దాడికి పాల్పడ్డ వైసీపీ నేతలు**

రాళ్లదాడికి పాల్పడిన వైసిపి నేతలు ఇప్పుడు గగ్గోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ ఘటనపై స్పందించిన ఆయన, "ఎక్కడా లేని విధంగా వైసీపీ నాయకులు మహిళలనే చూడకుండా రాళ్లతో దాడి చేశారు. ఇప్పుడు పోలీసులు అరెస్టులు చేస్తే వైసీపీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఇదే వాళ్ల దుర్మార్గ పాలన స్వరూపం," అని మండిపడ్డారు.

**వైసిపి ప్రభుత్వంలో 17 కేసులు పెట్టారు**

వైసీపీ ప్రభుత్వంలో తన పై 17 కేసులు పెట్టారు. అయినా ప్రజల కోసమే నిలబడ్డా "వైసీపీ పాలనలో నన్ను 17 కేసులతో వేధించారు. ప్రజల సమస్యలపై ధర్నాలు చేస్తే దాడులు చేశారు. అయినా నేను వెనకడుగు వేయలేదు," అన్నారు.

**విమర్శించడం సిగ్గుచేటు**

**వెన్నుపోటు ఇచ్చిన వైసీపీ నిబద్ధతగా నిలుస్తున్న టీడీపీ అని కొనియాడారు.**

అప్పటి వైసీపీ ప్రభుత్వం "ఒక్కో కుటుంబానికి అన్ని పిల్లలకు అమ్మఒడి" అని మాట ఇచ్చి చివరకు ఒక్కరికి మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం "కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా అందరికీ" తల్లికి వందనం పథకం అమలు చేస్తోందన్నారు. దీంతో 67 లక్షల మందికి పైగా విద్యార్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

**మాట నిలబెట్టుకున్నాం**

**వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000**

వైసీపీ ప్రభుత్వం ఏడాదికి కేవలం రూ.250 చొప్పున పెంచిందని, కానీ తెలుగుదేశం ప్రభుత్వానికి వచ్చి వెంటనే వృద్ధుల పెన్షన్లను రూ.4,000కి, వికలాంగుల పెన్షన్లను రూ.6,000కి పెంచామని తెలిపారు.

సంక్షేమం మా ప్రభుత్వ లక్ష్యం

**మత్స్యకారులకు:** వైసీపీ ఇచ్చింది రూ.10,000 – టీడీపీ పెంచి రూ.20,000

**అర్చకులకు:** వైసీపీ రూ.10,000 – టీడీపీ రూ.15,000

**ఇమామ్, మౌజన్లకు:** వైసీపీ రూ.10,000 – టీడీపీ రూ.15,000

**బీసీలకు:** వైసీపీ ప్రభుత్వం సున్నా – టీడీపీ రూ.1000 కోట్లు

**ఎస్సీలకు:** వైసీపీ సున్నా – టీడీపీ రూ.340 కోట్లు

**పొదుపు సంఘాలకు:** వైసీపీ నిధులే లేవు – టీడీపీ రూ.1840 కోట్లు

**గ్యాస్ సిలిండర్:** వైసీపీ ఎలాంటి మద్దతు లేదు – టీడీపీ సంవత్సరానికి రూ.1800 మద్దతు

**అన్న క్యాంటీన్:** ఐదు రూపాయలకే భోజనం, టిఫిన్ అందిస్తున్నామని తెలిపారు.

వైసిపి నేతలు బుద్ధి తెచ్చుకోవాలి

తెలుగుదేశం ఇచ్చిన మాట నిలుపుకుంటుంది . వైసీపీ నేతలు బుద్ధి తెలుసుకోవాలి. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా పనిచేస్తోందని, ప్రజలకు ఏ ఒక్క రూపాయి సాయం తగ్గకుండా న్యాయం చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. చివరగా వైసీపీ నేతలు నిజాలు గ్రహించి విమర్శలకు బదులు ప్రజల సమస్యలపై ఆలోచించాలని హితవు పలికారు. ఈ మీడియా సమావేశంలో మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, మార్కాపురం మాజీ ఏఎంసి చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసుల పై మాజీ ఎమ్మెల్యే 'అన్నా' ఫైర్

అధికారం శాశ్వతం కాదని హెచ్చరిక




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)

పొదిలిలో ఈ నెల 11న జరిగిన వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలపై మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తీవ్రంగా స్పందించారు. వైసిపి శ్రేణులపై అక్రమ కేసులు బనాయించడాన్ని ఖండిస్తూ, అధికార పార్టీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిపై ఆయన శనివారం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో నిప్పులు చెరిగారు.

**అధికారం శాశ్వతం కాదు...** అధికారం శాశ్వతం కాదని, వడ్డీతో సహా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అని అన్నా రాంబాబు అన్నారు. "మీరు అధికారంలో ఉన్నారు కాబట్టి కేసులు పెడతారు, కానీ ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. ప్రజల సమస్యలపై మనం పోరాడాలి, గుండా రాజకీయం కాదు," అని హెచ్చరించారు. నాయకులుగా మన గురించి కాదు... బాధితుల గురించి ఆలోచించాలి అని కందులకు హితవు పలికారు. వైసిపి శ్రేణుల పై రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టిన తీరు ప్రజల్లో రగిలిపోయే ఆగ్రహానికి దారితీస్తుందని పేర్కొన్నారు. జూన్ 11న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన సందర్భంగా వేలాది ప్రజల మధ్య పర్యటన కొనసాగుతుండగా, టిడిపి కార్యకర్తలు బుడగలు, వాటర్ బాటిళ్లు విసిరి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని వైఎస్సార్సీపీ ఆరోపించిన నేపథ్యంలో వారు చేయకూడదన్నది నిజం, కానీ మీ కార్యకర్తలలాగే మా వాళ్లు రెచ్చిపోయుంటే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యేవి?" అంటూ ఎమ్మెల్యే కందులను ప్రశ్నించారు అన్నా. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అనుమతితో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు అలజడి సృష్టించారన్న ఆరోపణలపై స్పందిస్తూ అన్నా రాంబాబు మీరైనా, మేమైనా... ప్రజల అభివృద్ధే కోరుకోవాలి. రాజకీయాలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు మానాలి. కేసులు పెడితే సమస్యలు పరిష్కారం కావు. కేవలం కక్ష పెరుగుతుంది అన్నారు. పొదిలి ఘటన నేపథ్యంలో సుమారు 40 మంది పై వేసిన అక్రమ కేసులు తీవ్ర ప్రతికూలతను తీసుకొస్తాయని, ఈ చర్యల వల్ల బాధితుల్లో ప్రతీకార భావనలు పెరుగుతాయని, అలాంటి ఉద్రిక్తతలు ఎవరికీ మేలు చేయవని అన్నారు. ఇలాంటివి మిమ్మల్ని, మమ్మల్ని కాకుండా, ప్రజలకే భారంగా మారతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఒరవడిని మార్చుకోకపోతే... నేటి బాధితులు రేపటి నాయకులవుతారు... అది మరిచిపోవద్దు అని అన్నా రాంబాబు సూటిగా హెచ్చరించారు.

## ఎంపీ మాగుంట కోరిక పై మార్కాపురం జిల్లా ఆవశ్యకతపై ప్రధాన అంశాలు కోరిన సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)

గుంటూరు, కర్నూల్, నెల్లూరు జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలతో ప్రకాశం జిల్లా ఏర్పడిందని, అధిక శాతం ప్రజలు వ్యవసాయం మరియు వ్యవసాయ కూలీ పనులపై జీవిస్తున్నారని, కనుక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందన్నారు. మార్కాపురం నూతన జిల్లాను ఏర్పాటు చేయవలసినదిగా నారా చంద్రబాబు నాయుడుని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి 2024లోనే కోరారు. పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం ఏరియా ఋతుపవనాలకు దూరమై, వర్షాలు తక్కువై అన్ని రంగాలలో ఇంకా వెనుకబడే వున్నది. అటు 11,650 చ.కి.మీటర్ల విస్తీర్ణంలోను, ఇటు 14,23,147 మంది జనాభాలోను రాష్ట్రంలోనే అతి పెద్ద జిల్లాగా ఉండుటచే పరిపాలనా సౌలభ్యం కోల్పోయింది. ముఖ్యంగా ఒంగోలు జిల్లా కేంద్రం, మార్కాపురం ఏరియాలకు ఎక్కువ దూరమై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుచున్నారు. మార్కాపురం దాని చుట్టూ వున్న గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల ప్రజల ఆచారాలు, అలవాట్లు, ఆహార వ్యవహారాలు, భాషా వేషాలు ఒకటిగా వున్నారు. జిల్లాకు కావలసిన వసతులు మరియు వనరులు వుండడం వలన ప్రత్యేక మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు ఆవష్యకత వున్నది. గడచిన ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి గారు (తరువాయి 4లో...)

# పొదిలి సిఐ పై చెవిరెడ్డి ఫైర్

అరెస్టు అయిన వారితో మాట్లాడేందుకు నిరాకరించిన సిఐ వెంకటేశ్వర్లు

దొంగలతో ఎలా మాట్లాడతావ్ అన్నందుకు

పొదిలి పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

స్టేషన్ ముందు ధర్నాకు దిగుతానన్న చెవిరెడ్డి

నచ్చజెప్పి పంపించివేసిన డిఎస్పీ లక్ష్మీనారాయణ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 14)

అరెస్ట్ అయిన వారితో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడేందుకు పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టి వెంకటేశ్వర్లు నిరాకరించారు. "దొంగలతో ఎలా మాట్లాడుతావ్" అన్నందుకు పొదిలి పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇటీవల రాళ్లదాడి ఘటనలో అరెస్ట్ అయిన వైసిపి కార్యకర్తలతో మాట్లాడేందుకు స్థానిక సీఐ నిరాకరించడంతో జరిగిన మాటల తీరు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పొదిలి సంఘటనకు సంబంధించి పోలీసులు వరుస అరెస్టులు చేస్తున్న నేపథ్యంలో రెండు రోజుల క్రితం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మరో 9 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 15 మందిలో తొమ్మిది మందిని శనివారం కోర్టు కు హాజరు పరుస్తూ మరో ఆరుగురికి స్టేషన్ బెయిలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన వారిని కలిసి మాట్లాడేందుకు వైసీపీ ఒంగోలు పార్లమెంటు ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, కుందూరు నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి, ఇతర వైసీపీ నాయకులు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్నారు. కోర్టుకు



తరలించే తొమ్మిది మందిని మినహా మిగిలిన ఆరుగురికి పోలీసులు స్థానిక స్టేషన్ బెయిలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా స్టేషన్ బెయిల్ ఇచ్చిన వారితో తాను మాట్లాడేందుకు అనుమతించాలంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి వెంకటేశ్వర్లును కోరారు. అందుకు ఆయన అనుమతించకపోవడంతో మరోసారి చెవిరెడ్డి వారితో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా దొంగలతో మాట్లాడేది ఏంటి అంటూ వ్యాఖ్యానించడంతో దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అరెస్ట్ అయిన వారు దొంగలు ఎలా అవుతారంటూ అధికారి హోదాలో జాగ్రత్తగా మాట్లాడాలని చెవిరెడ్డి వాదన చేయడంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. చిన్నపాటి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. (తరువాయి 4లో...)

## అమ్మఒడికి కోతలు పెట్టి తల్లుల్ని మోసం చేసిన జగన్‌కి తల్లికి వందనంపై మాట్లాడే అర్హత ఉందా?

- సంక్షేమానికి సరికొత్త నిర్వచనం తల్లికి వందనం
- వైసీపీకి మహిళలు ఓటెయ్యలేదని జగన్ వారిపై కక్ష పెంచుకున్నారు
- పాలన అంటే బటన్ నొక్కడం కాదు...
- భవిష్యత్తు నిర్మాణం అనే విధంగా కూటమి పాలన
- మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- 32 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల విలువైన
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి డోలా
- ఇప్పటి వరకు కొండపి నియోజకవర్గంలో రూ.12 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 14)

అమ్మఒడికి కోతలు పెట్టి తల్లుల్ని మోసం చేసిన జగన్ కి తల్లికి వందనంపై మాట్లాడే అర్హత ఉందా? అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి జగన్‌ని నిలదీశారు. శనివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం లోని క్యాంప్ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు రూ. 18 లక్షల విలువైన సీఎం.ఆర్. ఎఫ్ చెక్కులు మంత్రి అందజేశారు. ఇప్పటి వరకు కొండపి నియోజకవర్గంలో రూ.12 కోట్ల విలువైన సీఎం.ఆర్. ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా (తరువాయి 4లో...)

# పొదిలి సిఐ పై చెవిరెడ్డి ఫైర్



తర్వాత 9 మందిని పొదిలి కోర్టుకు హాజరు పరిచారు. అనంతరం కోర్టు వద్దకు వచ్చిన వైసీపీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, నాయకులు కెవి రమణారెడ్డి తదితరులు కలిసి మాట్లాడారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వైసీపీ నేతలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. అయితే అరెస్టు అయిన వారిలో 15 మందిలో 9 మందిని కోర్టుకు హాజరుపరచి, మిగిలిన వారికి టీడీపీ నాయకులే విడిపించారని వైసీపీ నాయకులు చెబుతుండడం గమనార్హం... ఈ విషయంలో పోలీసుల పై కూడా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా పొదిలి ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తుండగా ఈ అరెస్టుల పర్వం మరికొద్ది రోజులు కొనసాగే విధంగా తెలుస్తోంది.

## వేటపాలెం తాసీల్దార్ విధుల నుండి తొలగింపు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 14)

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వేటపాలెం తహాసిల్దార్ పార్వతిని విధుల నుండి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేటపాలెం మండలంలో పలు భూకబ్జాలు, ఆక్రమణల విషయమై అధికార దుర్వినియోగం చేయడంతో పాటు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వేటపాలెం తహాసిల్దారును విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీ పరిధిలోని వేటపాలెం స్ట్రైట్ కట్ కరకట్ట, దత్తక్షేత్రం కాలనీలో నివేశన స్థలాలు, రోడ్డు మార్జిన్స్, రోడ్ల ఆక్రమణలు చేసిన విషయమై పలు ఫిర్యాదులు చేసినప్పటికీ విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వేటపాలెం తహాసీల్దార్ తో పటు మరో ఇద్దరు వీఆర్వోలను కూడా సస్పెండ్ చేసినట్లు సమాచారం. చీరాల తహాసిల్దార్ గోపికృష్ణ వేటపాలెం మండలం అదనపు బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## ఎంపీ మాగుంట కోరిక పై మార్కాపురం జిల్లా ఆవశ్యకతపై ప్రధాన అంశాలు కోరిన సీఎం చంద్రబాబు

మార్కాపురం ఏరియా ప్రజల చిరకాల కోరిక ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటుకు హామీ ఇవ్వడం జరిగింది. దీని పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, నూతన జిల్లా ఏర్పాటు పై మార్కాపురం ప్రాంత ప్రజల కోరికలు, నిర్దిష్ట సిఫార్సులు ప్రభుత్వానికి పంపమని జిల్లా కలెక్టర్‌ను కోరిన దాని పై, కలెక్టర్, మార్కాపురం సబ్ కలెక్టర్‌ని నివేదిక పంపమని కోరారు. కనుక మార్కాపురం ప్రాంత నాయకులు, ప్రజలు, అన్ని రంగాల వారు మార్కాపురం నూతన జిల్లా ఆవశ్యకతకు సంబంధించిన అన్ని విషయాలు మార్కాపురం సబ్ కలెక్టర్‌కి తెలపాలని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు.

## అమ్మఒడికి కోతలు పెట్టి తల్లుల్ని మోసం చేసిన జగన్‌కి తల్లికి వందనంపై మాట్లాడే అర్హత ఉందా?

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సంక్షేమానికి సరికొత్త నిర్వచనం తల్లికి వందనం. నాడు నాన్నకు ఇంధనం పేరుతో నాసిరకం మద్యంతో జగన్ పేదల నుంచి వేల కోట్లు దోచుకున్నారు. నేడు తల్లికి వందనం పేరుతో చంద్రబాబు నాయుడు నేడు 67.27 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10వేల కోట్లు జమ చేశారు.గతంలో కంటే 24.5లక్షల మంది తల్లులకు అదనంగా తల్లికి వందనం. వైసీపీకి మహిళలు ఓటెయ్యలేదని జగన్ వారిపై కక్ష పెంచుకున్నారు.అందుకే మా పాలనలో మహిళలు సంతోషంగా ఉంటే జగన్ ఓర్వలేక పోతున్నారు. పాలన అంటే బటన్ కాదు... భవిష్యత్తు నిర్మాణం అనే విధంగా కూటమి పాలన సాగుతోందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.


# పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేసిన మంత్రి స్వామి





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 14)

జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ తిరుణాల ముగింపు సందర్భంగా పోలేరమ్మ అమ్మవారిని శనివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ ఈఓ బైరాగి చౌదరి, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం మంత్రి స్వామికి అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ ఈఓ, ఇతర అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, కామేపల్లి మండలనాయకులు ఏలూరి రాంబాబు, పెద్దబాబు, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## పొదిలిలో జగన్ పర్యటనలో మహిళల పై దాడి కేసులో మరో 9 మంది అరెస్ట్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 14)

పొదిలిలో ఈ నెల 11వ తేదీన జరిగిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి రైతు పోరుబాట పర్యటనలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు మహిళల పై వైసీపీకి చెందిన కొందరు దాడి జరిపిన కేసులో ఐదు మందిని, అలాగే స్థానిక పొగాకు బోర్డులో జరిపిన దాడికి సంబంధించిన కేసులో మరో నలుగురిని పొదిలి ఎస్ఐ వి వేమన అరెస్టు చేసినట్లు సిఐ టి వెంకటేశ్వర్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనప్పటికీ, వారి పై చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని సిఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

# స్టూడెంట్ బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 14)

కనిగిరి ఆర్టీసీ డిపో పరిధిలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను శనివారం 14వ తేదీ నుంచి కనిగిరి ఆర్ టి సి బస్ పాస్ కేంద్రంలో స్టూడెంట్ పాస్‌లు జారీ చేస్తున్నామని కనిగిరి ఆర్‌టిసి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు స్టూడెంట్ పాస్‌ను ఏపీఎస్ ఆర్టీసీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని తమ విద్యాసంస్థ నుంచి దరఖాస్తు ఫారం పై ప్రిన్సిపాల్ సంతకం, ప్రిన్సిపాల్ సీల్ వేయించుకొని బస్ పాస్ కేంద్రంలో స్టూడెంట్ బస్ పాస్ పొందవచ్చున్నారు.




# 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)

ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, ఏపీ లారీ అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. జులై 15, 16 తేదీల్లో ఒంగోలులో జరిగే మహాసభల కరపత్రాన్ని సిఐటియు కార్యాలయంలో శనివారం యూనియన్ నేతలు ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యం.అయ్యపరెడ్డి , ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, రవాణా రంగం జిల్లా నాయకులు సయ్యద్ మున్వర్ భాష ,రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగం సమస్యలపై, కార్మిక సమస్యలపై నిరంతరం కృషి చేస్తుంది .యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో జులై 15, 16 తేదీల్లో జరగనున్నాయి. ఈ మహాసభలకు 26 జిల్లాల నుండి 500 మంది ప్రతినిధులు వస్తున్నారు. రెండు రోజులు పాటు రాష్ట్రంలో ఆటో ట్రాలీరంగం, రవాణా రంగం ఎదుర్కొన్న సమస్యలు కేంద్రం తీసుకొచ్చిన వెహికల్ అమెండ్మెంట్ యాక్ట్ వలన రవాణా కార్మికులకు నష్టాలు , మన రాష్ట్రంలో ఆటో, లారీ రవాణా వాహనాలపై అన్ని రకాల చలనాలు పెంచుతూ జీవో నెంబర్ 21 తీసుకురావడం జరిగింది. పోలీసులు, ఆర్టిఏ అధికారులు, అక్రమజరిమానాలు రద్దు చేయాలని ,ఫైనాన్షిర్ల దౌర్జన్ నుంచి ఆటో రంగాన్ని కాపాడాలని కోరుతున్నామన్నారు. డ్రైవర్లకు శిక్షలు పెంచుతూ భారత న్యాయ సం హిత చట్టంలో 106 సెక్షన్లు మార్చాలని అనేక పోరాటాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాం. అంతేకాక కేరళ, తమిళనాడు తరహా డ్రైవర్లకు సంక్షేమ బోర్డు సాధనకై పోరాడుతున్నాం. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ మహాసభలను జయప్రదం చేయవలసిందిగా శ్రీనివాసులు కోరారు ప్రకాశం జిల్లాలో ఆటో, రవాణా రంగం కార్మిక సమస్యలపై నిరంతరం కృషి జరుగుతుంది .ఆర్టిఏ ,పోలీస్ అధికారులు వేధింపులకు నిరంతర ఉద్యమాలు జరుగుతున్నాయి జిల్లా వ్యాప్తంగా ఆటో కార్మికులకు పర్మినెంట్ స్టాండ్ కోసం పోరాడుతుంది కార్మికులు నేషనల్ హాలిడేస్ బకాయిల కోసం మేనేజ్మెంట్ స్పష్టమైన హామీ కోసం నాలుగు మాసాల పోరాడి విజయం సాధించింది ఆర్టీసీ రంగంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ రక్షణకై పోరాడుతుంది. జులై 15, 16 తేదీల్లో ఒంగోలు జరుగుతున్న మహాసభలకు అభ్యుదయవాదులు ప్రజాస్వామ్యవాదులు ఉద్యోగులు కార్మికులు ప్రజలు ఆర్థిక హార్దిక సహకారాలు అందించ వలసినదిగా కోరుతున్నామన్నారు.




## అంతర్జాతీయ పితృ దినోత్సవ శుభాకాంక్షలు

జీవితంలో ఎన్ని ఆటుపోట్లుఎదురైనా
ఎన్ని తుపానులు వచ్చిన రక్షణ కవచమై
నిలిచి ప్రేమను పంచుతు...
బ్రతుకర్థం చెప్పిన భగవంతుడు నాన్న ..!
గెలిచినప్పుడు పదిమందికి ఆనందంగా
చెప్పుకునే వ్యక్తి, ఓడినప్పుడు భుజంపై
తట్టి గెలుస్తావులే అని దగ్గరకి
తీసుకుని హత్తుకునే వ్యక్తి నాన్న..!
ఓ ఆప్యా యత, ఓ భరోసా, ఓ త్యాగం నాన్న..!
తొలి గురువు, స్నేహితుడు, మార్గదర్శి నాన్న..!
తానే బొమ్మయి ఆడించే వ్యక్తి నాన్న..!
సరైన మార్గంలో పయనింప చేస్తూ
గమ్యా న్ని పరిచయం చేసిన వ్యక్తి నాన్న..!
నాన్న నాతో లేకపోయినా ఆయన జ్ఞాపకాలను
మధురమైన స్మృతులుగా మలచుకున్న....
మీ ప్రేమ నా కలలకు ఇంధనంలా పనిచేస్తుంది
నాన్న మీకు నేను ఎప్పటికీ కృతజ్ఞురాలిని.
అంతర్జాతీయ పితృ దినోత్సవ శుభాకాంక్షలతో..



రచన - మంజుల పత్తిపాటి
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
మాజీ డైరక్టర్,
యాదాద్రి భువనగిరి జిల్లా,
తెలంగాణ రాష్ట్రం.
చరవాణి 9347042218.

# సంతోష ఫలాలను ప్రజలు అందుకోవాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 14)

అభివృద్ధి, సంక్షేమం, యోగాతో ఆరోగ్యం, సంతోష ఫలాలను ప్రజలు అందుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలలో భాగంగా జిల్లాస్థాయి యోగాసనాల ప్రదర్శన పిట్టలవానివారిపాలెం మండలం పివి పాలెం గ్రామం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం జరిగింది. కేర్ నాచురోపతి వైద్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరిని ఎంతగానో ఆకట్టుతున్నాయి. అనంతరం గ్రామ ప్రధాన కూడలి వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. యోగాతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను నినదిస్తూ యువతీ, యువకులు ఉత్సాహంగా ర్యాలీలో ముందుకు సాగారు. వికసిత్ భారత్ లక్ష్యంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వికసిత్ భారత్ దిశగా కేంద్రం, స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వాలు అడుగులు వేస్తుండగా, వాటి ఫలాలను ప్రజలు అందుకోవాలన్నారు. మానసిక సమతుల్యత లేని సమాజాన్ని యోగా సరి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఉద్యోగాలు, పనులలో ఒత్తిడికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మానసిక ఒత్తిడి నుంచి ప్రజలను యోగా విముక్తి కల్పిస్తుందన్నారు. నాణ్యమైన జీవితం యోగాతోనే సాధ్యమన్నారు. నాచురోపతి యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. యోగాసనాలతో కలిగే ప్రయోజనాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎలాంటి ఖర్చు, మందులు లేకుండా రోగాలు నివారించడం యోగాతోనే సాధ్యమన్నారు. ఈనెల 21వ తేదీన చరిత్రలో ఎన్నడు లేనంత భారీ స్థాయిలో విశాఖపట్నంలో ప్రపంచ యోగ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రధానమంత్రి మోడీ హాజరయ్యే ఈ




కార్యక్రమానికి అనుబంధంగా జిల్లా కేంద్రమైన బాపట్ల సూర్యలంకలో పదివేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు యోగాసనాలతో తమ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కేర్ నాచురోపతి వైద్య కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఆ




విద్యార్థులు జిల్లాస్థాయి యోగాసనాలలోనూ ప్రథమ స్థాయిలో నిలవడంపై ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎపి.డి. కె.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, డ్వామా పిడి జయలక్ష్మి, మహిళ శిశు సంక్షేమ శాఖ పిడి రాధా మాధవి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాలరావు, ఎక్సైజ్ శాఖ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









# ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 14)

అన్నా క్యాంటీన్లలో ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు.అన్న క్యాంటీన్ సిబ్బంది వ్యవహార శైలి బాగోలేదని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ దృష్టికి ప్రజలు తీసుకొనిరాగా వెంటనే ఆయన అన్నా క్యాంటిన్ ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అన్న క్యాంటిన్‌లో పనిచేసే సిబ్బంది క్యాంటిన్‌కు వచ్చే ప్రజలు పట్ల ప్రేమానురాగలు కలిసి నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన హెచ్చరించారు. ఆహార పదార్దాల రుచి,నాణ్యతలను ప్రజలను అడిగి తెలుసుకోగా బాగానే ఉందని సొంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్నా క్యాంటిన్లను ఏర్పాటుచేసిందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్నా క్యాంటీన్ల ద్వారా రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత అన్నా క్యాంటీన్ నిర్వాహకులపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 5 రూపాయల ధరకన్నా ఎక్కువ వసూలు చేయవద్దని, ఉదయం మిగిలిన ఆహార పదార్థాలను సాయంత్రం సమయంలో ఎట్టిపరిస్థితులలోనూ ప్రజలకు అందించరాదన్నారు.అన్నా క్యాంటీన్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.ప్రజలు ఆహారం తిన్నతరవాత ప్లేట్ లను విమర్శలకు తావులేకుండా పూర్తిగా శుభ్రంచేయాలని ఆయన తెలిపారు.








# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అత్యంత భారం

### గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న గాంధీనగర్ కాలనీ వాసులు

### స్మార్ట్ మీటర్లు ఏర్పాటును అడ్డగించండి సిపిఎం నేతలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)


గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను ఒంగోలు నగరంలోని గాంధీనగర్ 33వ డివిజన్ కాలని వాసులు అడ్డగించారు. బుధవారం ఉదయం ఆదాని కంపెనీ కి చెందిన ప్రతినిధి విద్యుత్ సిబ్బంది తో కలసి గాంధీనగర్ 3వ లైన్‌లో గృహాలకు తొలుత స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఉపక్రమించారు. తమ నివాసాలకు ఉన్న మీటర్లు పని చేస్తున్నాయని, ప్రస్తుతం వాడుకుంటున్న మీటర్లకు డిపాజిట్ 10 వేల రూపాయలు చెల్లించి మీటర్లు ఏర్పాటు చేసుకకున్నామని కాలనీకి చెందిన వారు వారిని ప్రశ్నించారు. మీటర్లుకు డబ్బు చెల్లించవలసిన అవసరం లేదని, ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మీటర్ బాగానే పనిచేస్తుంది ఇంత అర్జెంట్‌గా మీటర్లు మార్చవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మీటర్లు ఇవి, అందరికీ బిగిస్తున్నాం మీకూ బిగిస్తామని ఒప్పించే ప్రయత్నం చేశారు. ఒక ఇంటికి మీటర్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేసారు. తాను మీటర్ మార్చమని డిపార్టుమాంట్‌ను కోరలేదు, అమౌంట్ కూడా కట్టలేదు, కొత్త మీటర్ ఎలా బిగిస్తారని ప్రశ్నించారు. మీటర్లకు డబ్బు ఇవ్వనవసరం లేదని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు సిబ్బంది ఒప్పించే ప్రయత్నం చేసారు. స్థానికులను ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికి వారు అంగీకరించకపోవడంతో అదాని మీటర్ల టెక్నీషియన్స్ ను ప్రజలు అడ్డుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, షేక్ పీర్ సాహెబ్ ,దాసు, గురవయ్య తదితరులు అక్కడకు చేరుకొని సిబ్బందిని స్మార్ట్ మీటర్లు ఎవరు బిగించమన్నారు? కాంట్రాక్టర్ ఎవరు అని ప్రశ్నించడంతో వారు అక్కడ నుంచి ఉడాయించారు.

**స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ను ప్రతిఘటించండి: సీపీఎం**

వినియోగదారులకు పెను భారమైన స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రతిఘటించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు గాంధీనగర్ కాలనీ వాసులకు సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడుస్మార్ట్ మీటర్ల ప్రక్రియను వ్యతిరేకించిన తెలుగుదేశం, అధికారం చేపట్టిన అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఈ పాటికే దుకాణాలకు, వాణిజ్యసముదాయాలకు స్మార్ట్ మీటర్లు బిగించారని ఆయన పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వల్ల వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతారని ఆయన వివరించారు. సర్చార్జీల పేరుతో ఈ పాటికే భారమైన విద్యుత్ చార్జీలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత రెడ్డింపయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముందుగానే విద్యుత్ కోసం రీఛార్జి చేసుకోవాలని మీటర్ల తయారు ఖర్చు సైతం వినియోగదారుడు నెలవారి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. టైమ్ ఆఫ్ చార్జీల పేరుతో పగటిపూట రెట్టింపు చార్జీలు వసూలు చేసే ప్రమాదం ఉందన్నారు. కంపెనీ ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తారని, వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వినియోగదారుల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియను అడ్డగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



## మద్యపానం పై అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)
మార్కాపురం ఎస్సీ, బీసీ కాలనీలో మద్యపానం పై అవగాహన కార్యక్రమం ప్రొహిబిషనల్, ఎక్సైజ్ అధికారులచే మహిళలకు నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని ఎస్సీబీసీ కాలనీలో ఉన్న వెలుగు కార్యాలయంలో శనివారం ప్రొహిబిషనల్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మద్యపానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఒంగోలు డిపిఓ షేక్ అయేషా బేగం మాట్లాడుతూ కుటుంబ శ్రేయస్సు కోసం మహిళల దృష్టి ఎంతో అవసరమని వివరించారు. ఆమె మాట్లాడుతూ, మద్యపానం, గంజాయి, ఇతర చెడు అలవాట్లు కుటుంబాలను నాశనం చేస్తాయని, అలాంటి అలవాట్లలో పడ్డ కుటుంబ సభ్యులను శాంతిగా, తల్లిదండ్రులుగా మారుస్తూ మాట్లాడి మార్గదర్శనం చేయాలని సూచించారు. పిల్లలు స్కూల్ నుంచి వచ్చిన తర్వాత వారి బ్యాగులు, పుస్తకాలు, ప్రవర్తనను గమనించాలని, వారు ఎవరితో తిరుగుతున్నారు, వారి స్నేహితుల ప్రభావం ఎలా ఉందో తల్లిదండ్రులు జాగ్రత్తగా చూడాలని సూచించారు. మద్యపానానికి బానిసైన వ్యక్తులను అవసరమైతే రీఎడక్షన్ కేంద్రాల్లో చేర్చవచ్చుని, లేకుంటే వారి విషయాన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐకు తెలియజేస్తే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత పునరావాస కేంద్రాల్లో చేర్పించబడతారని ఆమె స్పష్టం చేశారు.

## అన్ని దానాల్లోకెల్లా రక్త దానం చాలా గొప్పది

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)
రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని శ్రావణి హాస్పిటల్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మార్కాపురం సబ్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుమారు 70 సార్లు రక్తాన్ని అందించిన దాత ప్రసాద్ కు దుశ్శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో అవసరమైన రక్తాన్ని అందించి ఎన్నో ప్రాణాలు కాపాడిన రక్తదాతలకు సత్కారం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రాణం విలువ తెలుసుకొని ప్రాణ దాత గా రక్త దానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తాన్ని దానం చేయుటకు అర్హులైన అందరూ అపోహలను వీడి రక్తాన్ని అందించాలని కోరారు. రక్తం దానం చేయడం వలన మనిషికి మేలే జరుగుతుందే గాని కీడు మాత్రం జరగదని చెప్పారు. అదేవిధంగా రక్తదాత ప్రసాద్ మాట్లాడుతూ నా జీవితంలో సుమారు 70 సార్లు రక్తదానం చేశానని నాకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాతో రక్తాన్ని అందించవచ్చుని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు బిజెపి కృష్ణారావు, డాక్టర్ శైలజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు భవన సముదాయం బాపట్ల పట్టణంలోనే ఉండేలా చర్యలు

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 14)
జిల్లా కోర్టు భవన సముదాయం బాపట్ల పట్టణంలోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లా కోర్టు భవన సముదాయానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. తూర్పు బాపట్లలో ఖాళీగా ఉన్న 7.5 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం ఇందిరానగర్ లో ఖాళీగా ఉన్న 2.80 ఎకరాల భూమిని పరిశీలించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న భూమి స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిక పొందుతామన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత దస్త్రాలను పంపాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట బాపట్ల మండల తహసిల్దార్ సలీమా, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

# అమ్మకు వందనం మున్సిపల్ కార్మికులకు వర్తింప చేయాలి

### ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్కే ఖాశీం డిమాండ్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)
అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తల్లికి వందనం పథకం ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి ఎస్కే కాసిం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం శనివారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కాసిం మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ లో ఒకటైన అమ్మకి వందనం పథకం చదువుకుంటున్న పిల్లలందరికీ అమలు చేస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతుందని, అయితే మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఈ పథకాన్ని అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి కయినా మున్సిపల్ కార్మికులను అర్హులుగా ప్రకటించి అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ పథకాలకు అర్హులుగా చేస్తామన్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని అన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని అన్నారు. అలాగే ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ కార్మికులకు రావలసిన డబ్బులు, చెప్పులు, బట్టలు, కుట్టు కూలీ, నూనెలు, టవల్స్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. అలాగే కార్మికులకు అవసరమైన పరికరాలు చీపులు సరఫరా చేయాలని, అలాగే డంపర్ బాక్సులు పెంచి కార్మికులకు పని భారం తగ్గించాలని, ట్రాక్టర్లకు ఇద్దరు వర్కర్ల బదులు 5 గురు వర్కర్లను వినియోగించాలని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో బదిలీ కార్మికులను ఆప్కాసులోకి చేర్చాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్ కె కాసిం ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేమా వెంకటేశ్వర్లు, నాయకులు దుప్పట్ల కాశయ్య, చెన్నమ్మ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# చిలకపాటి మాలకొండయ్య మృతికి సిఐటియు ప్రకాశం, నెల్లూరు జిల్లా కమిటీ నాయకుల నివాళి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 14)
పిటిపి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కరేడు ర్యాంపు మాజీ అధ్యక్షులు కామ్రేడ్. చిలకపాటి మాలకొండయ్య (వయస్సు 76) నిన్న రాత్రి 12 గంటలకు ఒంగోలులోని అమృత హార్ట్ హాస్పిటల్ లో మరణించారు. మరణ వార్త తెలుసుకున్న సిఐటియు ప్రకాశం,నెల్లూరు జిల్లాల నాయకులు మాలకొండయ్య స్వగ్రామం చాకిచర్ల వెళ్లి ఆయన మృతదేహానికి అరుణ పతాకాన్ని కప్పి పూలమాల వేసి ఘనమైన జోహార్లు అర్పించారు. అనంతరం అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ మాజీ రాష్ట్ర కార్యదర్శి వై సిద్దయ్య మాట్లాడుతూ కామ్రేడ్ చిలకపాటి మాలకొండయ్య పిటిపి యూనియన్ అధ్యక్షుడిగా ఉండి కరేడు ర్యాంపులోని పిటిపి ఫ్యాక్టరీలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నికరంగా రెండు దశాబ్దాల పాటు కృషి చేశాడని పేర్కొన్నారు. కార్మికుల వేతనాలు పెరుగుదల కోసం జరిగిన అనేక వేతన అగ్రిమెంట్‌లలో కార్మికుల పక్షాన నిలబడ్డారని, స్వతహా గానే ఆయన కార్మికుల పక్షపాతని అన్నారు. సిఐటియు ప్రకాశం జిల్లా ప్రారంభ దినాలలో1992లో యూనియన్ ఏర్పాటు కోసం ఉలవపాడు మండలం కరేడు ర్యాంపులోని పిటిపి కార్మికులు చేసిన పోరాటం స్ఫూర్తి దాయకం అన్నారు. పొగాకు కార్మికులలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మించటంలో పిటిపి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కీలకంగా ఉందని, మాలకొండయ్య తన జీవిత అంకం చివరి వరకు సిఐటియు పట్ల అంకిత భావంతో పనిచేశారు. మాలకొండయ్య మన మధ్యలో లేక పోవటం బాధాకరం. మాలకాండయ్య తోపాటు పిటిపిలో మరికొందరు నిర్మించిన యూనియన్ నేటికీ ఆదర్శంగా ఉందని,యూనియన్ ఏర్పాటు నుంచి సిఐటియు ఉద్యమానికి పిటిపి కార్మికుల తోడ్పాటు ఎంతగానో ఉందని పేర్కొన్నారు. ఆయనకు జోహార్లు అర్పించిన వారిలో సిఐటియు ప్రకాశం జిల్లా మాజీ కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సీఐటీయూ నెల్లూరు జిల్లా నాయకులు జివిబి కుమార్, యూనియన్ మాజీ కార్యదర్శి చీమటా. శ్రీనివాసులు, కోశాధికారి చిలకా శ్రీనివాసులు ఉన్నారు. అనంతరం ఈరోజు సాయంత్రం కరేడు ర్యాంపులోని పిటిపి ఫ్యాక్టరీ వద్ద పిటిపి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చిలకపాటి మాలకొండయ్య మృతికి ఫ్యాక్టరీ కార్మికులు సంతాపం తెలిపి 5 నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలిపారు.





# 17న పాలస్తీనా సంఘీభావ దినం నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)
గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను ఖండిస్తూ జూన్ 17న పాలస్తీనా సంఘీభావ దినంగా పాటించాలని వామపక్ష పార్టీల నాయకులు ఒంగోలు సుందరయ్య భవనంలో శనివారం సమావేశమై పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని పిలుపునిచ్చారు. వామపక్షాల దేశవ్యాప్త పిలుపును అనుసరించి ప్రకాశం జిల్లాలో సిపిఎం, సిపిఐ,సిపిఐ ఎంఎల్ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలు 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్వహించాలని, పాలస్తీనాకు సంఘీభావంగా పట్టణాలు,మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించాయి. 20 నెలలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారని, ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతక వైఖరిని అవలంబిస్తూ పాలస్తీనా ప్రయోజనాలకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలన్నారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ మారణకాండ, వివక్ష, ఆక్రమణలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలలో భాగంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులో నిరసన కార్యక్రమం జరపాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. ఈరోజు ఒంగోలు సుందరయ్య భవనంలో వామపక్షాల నాయకులు పాల్గొని పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని తీర్మానించడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో ప్రజానికం పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె. మాబు , ఆర్.వెంకట్రావు సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎమ్ ఎస్ సాయి ,సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు, ఆర్. మోహన్ సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, సిపిఐ నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు ,కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ నాయకులు పరిటాల కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

# తల్లికి వందనం విద్యార్థులకు వరం

**ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా "తల్లికి వందనం" అమలు చేస్తున్న నారా లోకేష్**
**67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ**
**ఇందు కోసం రూ.8,700 కోట్లు విడుదల**
**ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేసిన కూటమి ప్రభుత్వం**
**ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ పథకం అమలు**
**పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ**
**భావి తరాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి**
**గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ సర్వ నాశనం**
**తల్లికి వందనం పై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని ఖండించిన ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపి పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)**

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా చదివే పిల్లలు ఒకే ఇంట్లో ఎంతమంది ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం ఇస్తామని మాట ఇచ్చిన చంద్రబాబునాయుడు, లోకేష్ నేడు నెరవేర్చారు. ఏ పిల్లవాడూ విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోందని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. గత వైసీపీ పాలనలో పాఠశాల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి.. నేడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన ద్వారా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నిన్న తల్లికి వందనం అమలు చేసి సీఎం చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ గారు లక్షలాది మంది కళ్లలో వెలుగులు నింపారన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ.2 వేలు మంత్రి నారా లోకేష్ బాబు జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, మరి వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారని, అంటే రూ.2 వేలు వైసీపీ నాయకుల జేబుల్లోకి పోయాయా అని ప్రశ్నించారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే పథకాన్ని అమలు చేస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందన్నారు. పిల్లల స్కూలు ఫీజు కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా నారా లోకేష్ తల్లికి వందనం కార్యక్రమాన్ని తల్లులకు అందిస్తున్నారు. ఒకటో తరగతి లోనూ, ఇంటర్ ఫస్టియర్ లోనూ చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. తల్లి లేని పిల్లలకు వారి తండ్రికి కానీ లేదంటే సంరక్షకుల ఖాతాలో కానీ డబ్బులు జమ చేయడం జరుగుతుందని, అలాగే అనాథలైన పిల్లలకు జిల్లా కలెక్టర్ నిర్ధారించిన తర్వాత పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలియజేశారు. గత ప్రభుత్వం ప్రతి కుటుంబంలో ఒక్క విద్యార్థికే రూ.13వేలు ఇస్తామంటూ ఎన్నికల హామీని ఎగ్గొట్టిందని, కానీ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ లబ్ది చేకూరుస్తుంటే వైసీపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి చదువుకునేందుకు దోహదపడే విధంగా నేరుగా వారి తల్లి, సంరక్షకుని ఖాతాలో డబ్బులు వేస్తుంటే స్వాగతించకుండా తప్పుడు ప్రచారాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో ఈ పథకం కోసం కేవలం రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే.. కూటమి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు మేర ఖర్చు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థులకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు కందిపప్పులో కూడా కమిషన్ లు తీసుకున్న నీచ చరిత్ర వైసీపీ నాయకులదని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి నిధులు ఎప్పుడు పడతాయా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేచి చూసేవారని, నేడు పాఠ శాల లు ప్రారంభమైన రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమయ్యాయంటే విద్యార్థులపట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తుందని, ఒకవైపు అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నూకసాని బాలాజీ అన్నారు.

# రక్త దాతలకు సన్మానం

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 14)**

రక్తదానం మానవత్వానికి ప్రతీక అని రక్తదానం చేస్తే మరోకరి ప్రాణం కాపాడిన వారవుతారని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని శనివారం కనిగిరి మున్సిపాలిటీ కార్యాలయం చైర్మన్ ఛాంబర్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్,కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సోసైటీ ఆధ్వర్యంలో రక్త దాతల అభినందన సత్కార, సన్మానం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 54 సార్లు రక్త దానం చేసిన ముత్యాల శ్రీనివాస రెడ్డి, 40 సార్లు రక్త దానం చేసిన వర్రా చిన్న సింగా రెడ్డి,18 సార్లు రక్త దానం చేసిన మారెళ్ల వెంకట కృష్ణ రెడ్డి కి పూల మాల, శాలువాతో సత్కారం చేసి ఘనంగా సన్మానం చేసి వారిని అభినందించారు.ఈ



సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదని చెప్పారు.రక్తదానం చేసినవారికి సన్మానం చేయడం ద్వారా,వారి త్యాగాన్ని గుర్తించి, వారిని గౌరవించినట్లు అవుతుందని అన్నారు. రక్తదానం చేసేవారికి సన్మానం చేయడం ద్వారా మరిన్ని రక్త దానాలు చేయడానికి ఇతరులను ప్రోత్సహించవచ్చునని రక్తదానం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇది ఒక మంచి మార్గం అని కార్యనిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, జీఎస్ అండ్ జి డికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్, మదర్ సేవా సమితి అధ్యక్షులు నాయబ్ రసూల్, మాజీ ఎఎంసి డైరెక్టర్ బొట్టు శ్రీను, షేక్ నాగుర్ బి, మద్దిశెట్టి భారతి, తదితరులు పాల్గొన్నారు.




# పేరు గొప్ప ఊరు దిబ్బ పంచాయతీ పనితీరుకి నిదర్శనం

**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 14)**

కంభం పట్టణం కందులాపురం పంచాయతీ పేరుకే పెద్ద పంచాయతీ కాని పనితీరు శూన్యం. కంభం పట్టణం కందులాపురం సెంటర్‌లో ఉన్న సచివాలయం ఎదురుగా ఉన్న రోడ్డు సైడు కాలువలకు పట్టించుకొనే నాధుడే లేడు. కాలువలు శుభ్రం చేసే మాట దేవుడు ఎరుగు కనీసం నిల్వ ఉన్న మురికి చెత్తను కూడా తీసుకొని వెళ్లే వాళ్ళు లేక అల్లాడిపోతున్న స్థానిక ప్రజలు. గతంలో కనీసం రెండు రోజులకో మూడురోజులకో ఇళ్ల ముందు చెత్తను చెత్తబండ్లు వచ్చి తీసుకొని వెళ్ళేవి కాని ఇప్పుడు వారం రోజులు అవుతున్నా మురికి చెత్త కుళ్ళిపోయి దుర్వాసన వస్తున్నా కనీసం పట్టించుకొనే వాళ్ళు కరువు అయ్యారని మండిపడుతున్న ప్రజలు. ఎన్నోసార్లు పంచాయతీ అధికారులకు తమ గోడును విన్నవించుకున్నా అదిగో ఇదిగో అంటున్నారు కానీ, ఎవరూ రావడంలేదని మా ఇంటి ముందు కాలువలు స్వయంగా మేమే శుభ్రం చేసుకుంటున్నామని ఎన్నో ఏళ్ల నుంచి ఈ బాధలు పడుతున్నామని సైడు కాలువలు ఎలాగూ లేవు . కనీసం నిల్వ ఉన్న చెత్తను కూడా తొలగించలేరా అని ప్రశ్నిస్తున్నారు. కందులాపురం సెంటర్ నుండి కొద్ది దూరంలో డ్రైనేజి కాలువ ఉందని ఇక్కడ ఉన్న కాలువను పూర్తిగా శుభ్రం చేస్తే మురికినీరు నిల్వలేకుండా ఉంటుందని కొందరు కాలువ లోని మురికి నీరు వాళ్ళ ఇంటిముందు రాకుండా కాలువలు పూడ్చివేశారని అందువలన కాలువ నిండి మురుకి నీరు ఇళ్లలో రోడ్డుపైకి చేరుతుందని, అప్పుడు వచ్చే దుర్వాసన కారణంగా, దోమల కారణంగా అనారోగ్యం పాలవుతున్నామని అంతేగాక ఎక్కడ పడితే అక్కడ ఇళ్లముందు డంపింగులు పెడుతూ ఉరిలోని చెత్త చెదారం ఇంటిముందు వేస్తున్నారని దుర్వాసనతో, దోమలతో, పందులు వచ్చి చేరుతున్నా సినిమా చూస్తున్నట్లుంది కానీ ఏ అధికారి కూడా పట్టించుకోవడం లేదని ఇకనైనా దయవుంచి సంభందిత అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# వైసీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా సగిలి ప్రభాకర్ నియామకం

**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 14)**



కంభం పట్టణానికి చెందిన సగిలి ప్రభాకర్ వైసీపీలో ఉంటూ పార్టీకికి తను చేస్తున్న సేవలకు గాను వైసీపీ గుర్తించి కంభం మండలం ఎస్సి సెల్ కన్వీనర్‌గా నియమించిన సందర్బంగా పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రభాకర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా సగిలి ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వాళ్ళకి ఎప్పుడు అన్యాయం జరగదని ప్రతిఒక్కరి సేవలు గుర్తించి వారికి తగిన భాద్యతలు ఇచ్చి భుజం తట్టి ముందుకి నడిపిస్తుందని ప్రతి ఒక్క కార్యకర్తకి అండగా ఉంటూ నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగుతాను అని నన్ను మండల ఎస్సి సెల్ కన్వీనర్‌గా నియమించినందుకు వైస్సార్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ కార్యకర్త తాతపూడి నాను అంత్యక్రియలో పాల్గొన్న కనిగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జేపీ రాజు మాదిగ



**(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, జూన్ 14)**



వెలిగండ్ల స్థానిక గ్రామానికి చెందిన తాతపూడి నాను ఇటీవల కాలంలో హఠాత్ మరణం చెందాడు. ఆయన అంత్యక్రియ కార్యక్రమాలు ఈరోజు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న జెపి రాజు మాదిగ మాట్లాడుతూ నాను అతి చిన్న వయసులో మరణించడం (32) బాధాకరం ఎమ్మార్పీఎస్ కార్యక్రమానికి ప్రతి ఉద్యమానికి ముందు ఉండే వ్యక్తి వెలిగండ్లలో ఎమ్మార్పీఎస్ జెండా నిర్మించే దానికి తన వంతు పాత్ర పోషించాడని తన ఆటోలో మెటీరియల్ తోలుక రావటం అదేవిధంగా నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు దగ్గరుండి పూర్తి చేపించారని ఆయన అన్నారు ఆ కుటుంబానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తరపున పద్మశ్రీ గౌరవనీయులు మందకృష్ణ మాదిగ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తాతపూడి నాని తాతపూడి శ్యామ్ టిడిపి ఎస్సీ నాయకులు బద్రి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు తాతపూడి ప్రవీణ కుమార్ (జల్సా), గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సొంత నిధులతో సొంత ఊరికి గ్రావెల్ రోడ్డు

**ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు**

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 14)**



సొంత నిధులతో సొంత ఊరికి గ్రావెల్ రోడ్డు వేయిస్తున్న ఎంపీపీ దోర్నాల మండలం హసనాబాద్ గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో స్పందించిన ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్ శనివారం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎస్సీ కాలనీ నుంచి ఊర్లోకి గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు అవసరమైన పనులు చేపట్టారు. రహదారి ఇరువైపుల జేసీబీతో కాలువ పూడికతీత పనులను చేపట్టారు. సొంత నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాలు పడితే గ్రామంలోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారిమని, ఇప్పుడు గ్రావెల్ రోడ్డు వేస్తుండడంతో ఆ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించిన బిజెపి బృందం

### సౌకర్యాలను మెరుగుపరచాలని కోరిన బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివి కృష్ణారావు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌చార్జి, జూన్ 14)**

మార్కాపురం నడిబొడ్డున వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని బిజెపి నియోజకవర్గం ఇంచార్జ్ పివి కృష్ణారావు అధ్యక్షతన తన బృందంతో కలిసి సందర్శించారు. ఎంతో చరిత్ర కలిగిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం ప్రాంగణంలో బాత్రూంలు మరియు వసతి లేక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందిగా ఉందని గుర్తించారు. స్వామివారిని దర్శించుకునేందుకు రాయలసీమ మరియు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు సౌకర్యాలు లేక రాత్రులు నిద్ర చేయాలంటే ఇబ్బందికరంగానే ఉంటుంది. కార్య నిర్వహణ అధికారి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొంతల కృష్ణ, ప్రవీణ్, మద్దెల లక్ష్మీదేవి, దేశ బోయిన శ్రీను, చలువాది మురళి, కామేశ్వరరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.


# పాకల బీచ్‌లో యోగాంధ్ర



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)**

యోగాంధ్ర- 2025 మాసోత్సవాల్లో భాగంగా ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని, అందులో భాగంగా ఆదివారం సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్ వద్ద ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు యోగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యోగ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ యోగ కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని, యోగ కార్యక్రమానికి హాజరుగు వారు తమతో పాటు యోగ మ్యాట్‌ను తీసుకురావలసిందిగా తెలపడమైనది.

# తల్లికి వందనంతో పాటు నిరుద్యోగ భృతి అమలు చేయాలి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 14)**

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ సూపర్ సిక్స్ అమలులో భాగంగా నిరుద్యోగులకు, యువజనలకు ఇచ్చిన నిరుద్యోగ భృతి పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న 2. 50 లక్షల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు ఒంగోలు లోని మాదాల నారాయణస్వామి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర మానవరుల శాఖ మంత్రి నారా లోకేష్ తాను జరిపిన యువగలం పాదయాత్రలో తామ అధికారం వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయినా హామీని నెరవేర్చలేదన్నారు. అలాగే రాష్ట్రప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలలో దాదాపు 2.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఇంత వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జూన్ 12 నుంచి ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభం అస్తవ్యస్తంగా గందరగోళాల మధ్య ప్రారంభమైందన్నారు. ఓ వైపున టీచర్ పోస్టుల బదిలీల కౌన్సిలింగ్ జరుగుతుండగా మరొక వైపున ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించకుండా పాఠశాలలు ప్రారంభించారన్నారు. ఫలితంగా విద్యార్థులు కొంత గందరగోళానికి గురయ్యారన్నారు. మరో వైపు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల దగ్గర్నుంచి ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాల పేరుతో లక్షల రూపాయలు డబ్బులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు నిద్రపోతున్నారని ఆరోపించారు. గుర్తింపు లేకుండా అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నప్పటికీ వీటిని నియంత్రించాల్సిన ప్రభుత్వాలే చేతులెత్తేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచి, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి సిహెచ్ శ్యామ్, జిల్లా నాయకులు వి కోటి, వెంకట్రావు, సచిన్, ప్రేమ్ కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి యోగా ముఖ్యం

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 14)**

కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రీ ఇంటర్నేషనల్ యోగ డే సెలబ్రేషన్స్‌ను కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా యొక్క ప్రాముఖ్యత గురించి వివరిస్తూ యోగా అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైందన్నారు. ఇది ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక స్థితిని మెరుగుపరచడంలో, శ్వాసకోశ వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుందని యోగా ద్వారా, శరీరానికి, మనసుకు ప్రశాంతత లభిస్తుంది, దృఢత్వం, వశ్యత పెరుగుతాయని, అదేవిధంగా యోగా వల్ల మానసిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక అభివృద్ధి, రోగనిరోధక శక్తి, నిద్ర నాణ్యత కలుగుతాయని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు మోటార్ వాహన తనిఖీ అధికారి చెన్నూరి రాంబాబు, మాట్లాడుతూ యోగా ధ్యానం, మైండ్‌ఫుల్‌నెస్ మరియు శ్వాస వ్యాయామాల ద్వారా ఒత్తిడి, ఆందోళన మరియు డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను పెంచుతుందన్నారు. మానసిక స్పష్టతను అందిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు హరిణి హాస్పిటల్ డాక్టర్ మల్లికార్జున్‌రావు, చక్కా కేశవులు, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, ఎల్‌ఐసి డిఓ శశిధర్‌రెడ్డి, ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.







# తల్లికి గౌరవం ఇవ్వలేని వ్యక్తి... తల్లికి వందనం గురించి మాట్లాడటమే సిగ్గు!

**పాఠశాల అభివృద్ధికి అదనంగా రూ.1,346 కోట్లు కేటాయింపు**
**జగన్ పాలనలో 'అమ్మఒడి' కేవలం ఒకరికి మాత్రమే, తల్లికి వందనం అందరికీ**
**మంత్రి లోకేశ్ పై తప్పుడు ఆరోపణలు చేసి**
**ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న జగన్ అండ్ కో**
**చదువు కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా**
**నేరుగా తల్లుల ఖాతాల్లో నగదు జమ**
**67 లక్షలకు పైగా విద్యార్థులకు పథకం వర్తింపు**
**ఏకంగా రూ.10,091 కోట్ల వ్యయంతో పథకం అమలు**
**పాఠశాలలు ప్రారంభమైన రోజే నగదు జమ**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 14)**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం పేద తల్లులకు అండగా నిలుస్తోందని, ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ లబ్ధి కలగడం ఇదే మొదటిసారి అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం పాఠశాలలు ప్రారంభమైన రోజే తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం ద్వారా ప్రభుత్వానికి చదువుకునే విద్యార్థులు పట్ల నిబద్ధత స్పష్టమవుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67,27,164 మంది విద్యార్థులను గుర్తించి, వారికి లబ్ధి కలిగేలా రూ.10,091 కోట్లు కేటాయించామని, ఇందులో రూ.8,745 కోట్లు తల్లుల ఖాతాల్లోకి, మిగతా రూ.1,346 కోట్లు పాఠశాలల అభివృద్ధికి వినియోగిస్తున్నామని వివరించారు. ఒక్క ఇంట్లో ఒక విద్యార్థి ఉంటే రూ.13 వేలు, ఇద్దరు విద్యార్థులు ఉంటే 26 వేలు, ముగ్గురు విద్యార్థులు ఉంటే 39 వేలు, నలుగురు విద్యార్థులు ఉంటే 52 వేలు ఐదు విద్యార్థులు ఉంటే రూ.65 వేల వరకు జమచేయడం వల్ల తల్లిదండ్రుల్లో ఆనందం నెలకొందన్నారు. తల్లికి వందనం పథకం లబ్ది పొందిన విద్యార్థుల్లో బీసీలు 29.82, ఎస్సీలు 11.76 ఎస్టీలు 4.26, లక్షల మంది, మైనార్టీ విద్యార్థులు 66,500 మంది ఈ డబ్ల్యూ సి లో 8.44 లక్షల మంది ఉన్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఈసారి అదనంగా 24.65 లక్షల మంది విద్యార్థులకు పథకం వర్తింపజేయడం, రూ.3,205 కోట్లు అదనంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు మంత్రి లోకేశ్ జేబులోకి వెళ్లాయని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధమని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "కనీసం తల్లికి గౌరవం ఇవ్వలేని జగన్ రెడ్డి ఈరోజు తల్లికి వందనం గురించి మాట్లాడటం సిగ్గుచేటు" అని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో విద్యార్థుల భవిష్యత్తు నాశనం

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com